సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



అప్రమత్తంగా ఉండండి
మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అడ్డతీగల సీఐ రాంబాబు సూచించారు.
8లో



హత్యకేసులో ఏడుగురి అరెస్టు
చేతబడి నెపంతో మహిళలను హత్య చేసిన కేసులో ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ జగదీష్ తెలిపారు.
8లో



అభివృద్ధి పనులకు ప్రాధాన్యం
అరకులోయలో శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ రూ. 50 లక్షల మంజూరు చేశారు.
8లో

న్యూస్‌రీల్

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



ముంచంగిపుట్టులో రాత్రిపూట తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఏవోబీ నుంచి వచ్చే వాహనాల్లో ప్రయాణికుల బ్యాగులు,లగేజీలు క్షుణ్ణంగా పరిశీలించారు.పూర్తి వివరాలు సేకరించి విడిచిపెట్టారు.సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రభుత్వ కార్యాలయాల వద్ద పహారా కాశారు. మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో తనిఖీలు విస్తృతం చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.జోలాపుట్టు వేళ్లే నైట్ హాల్ట్ బస్సులను మండల కేంద్రానికే పరిమితం చేశారు. ఏవోబీలో ఆంధ్ర,ఒడిశా పోలీసు బలగాలు కూంబింగ్‌ను నిర్వహిస్తూ అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి.

పీఎం శ్రీకి కొయ్యూరు ఆశ్రమ పాఠశాల ఎంపిక

ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కొయ్యూరు: స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-1 పీఎం శ్రీకి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఆ పాఠశాల హెచ్‌ఎం ఎస్.బి.వి.మూర్తి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ పీఎం శ్రీకి పాఠశాల ఎంపిక కావడం వల్ల పలు ప్రయోజనాలున్నాయన్నారు. క్రీడలకు సంబంధించి ప్రోత్సాహం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

వైస్ అడ్మిరల్ బిస్వజిత్ 'పుల్లింగ్ అవుట్'

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఈస్టర్న్ నేవల్ కమాండ్ బిస్వజిత్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికింది. ఐఎన్ఎస్ సర్కార్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో వైస్ అడ్మిరల్ బిస్వజిత్ సెరిమోనియల్ గార్డ్‌ని తనిఖీ చేసిన అనంతరం ఫ్లాగ్ ఆఫీసర్స్, నేవల్‌షిప్స్, సబ్‌మెరైన్లు, వివిధ విభాగాధికారుల కమాండింగ్ అధికారులు నిర్వహించిన ప్లటూన్‌లను సమీక్షించారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించే పుల్లింగ్ అవుట్ సెరమనీలో బిస్వజిత్ పాల్గొన్నారు. 38 సంవత్సరాల పాటు నౌకాదళానికి విశిష్ట సేవలందించిన ఆయనకు ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా తూర్పు నౌకాదళంలో తన చివరి విధులు నిర్వర్తించడంగర్వంగాఉందన్నారు.

నెమ్మదించిన నదులు
తగ్గిన వరద

- విలీన మండలాల గ్రామాల చుట్టూ ఉన్న నీరు
- మరింత ముమ్మరంగా సహాయక చర్యలు



చింతూరు మండలం ఏజీ కొడేరులో వరద బాధితులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

చింతూరు: గోదావరి, శబరినదుల వరద నెమ్మదిగా తగ్గుతోంది. విలీన మండలాల్లోని పలు గ్రామాల్లో వరద నీరు తగ్గుముఖం పడుతోంది. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లోని కొన్ని గ్రామాల చుట్టూ ఇంకా వరదనీరు ఉంది. మరోవైపు వరదనీరు రహదారులను వీడక పోవడంతో వారం రోజులుగా నాలుగు మండలాల్లో రాకపోకలు సరిగా కొనసాగడం లేదు. వరద నెమ్మదిగా ఇళ్లను వీడుతుండడంతో పునరావాస కేంద్రాల్లోని బాధితులు ఇళ్లకు చేరుకుని శుభ్రం చేసుకుంటున్నారు. చింతూరు మండలంలో శబరినది వరద కారణంగా మనరాష్ట్రం నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు ఇంకా రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. వరద నెమ్మదిగా తగ్గుతుండడంతో అధికారులు సహాయక చర్యలను మరింత ముమ్మరం చేశారు. లాంచీలు, పడవల ద్వారా నిత్యావసరాలు, కూరగాయలను ముంపు ప్రాంతాలకు చేరవేస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు గాను జిల్లాలోని ఆరు మండలాలకు చెందిన ఆరుగురు పంచాయతీ కార్యదర్శులు, 32 మంది కార్మికులను విలీన మండలాలకు రప్పిస్తున్నారు.

బ్యాంకు ఖాతాలు సేకరించాలి

ఇళ్లను ఖాళీచేసిన వరద బాధితులకు ప్రభుత్వ సాయం అందించేందుకు వారి బ్యాంకు ఖాతాలను సేకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు వంటనూనె వెంటనే సరఫరా చేయాలని ఆదేశించారు. ముంపు తగ్గిన ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, తాగునీరు కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో వెంకటరత్నం పాల్గొన్నారు.



చింతూరులో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రతి కుటుంబానికి నిత్యావసరాలు

చింతూరు డివిజన్లో ముంపు బారిన పడిన ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్టు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే తెలిపారు. సోమవారం ఆయన చింతూరులో పర్యటించి బాధితులకు నిత్యావసరాలు అందాయా, లేదో అడిగి తెలుసుకున్నారు. డివిజన్లో ప్రజలకు వరదలకు ముందుగానే రేషన్ పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. అనంతరం ఆయన వీఆర్‌పురం మండలంలో ముంపు గ్రామాలను పరిశీలించారు.

ఎక్కడికక్కడే నిత్యావసరాల సరఫరా

వరద బాధితులకు ఎక్కడికక్కడే నిత్యావసర సరుకులకు సరఫరా చేస్తున్నట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. సోమవారం ఆయన కూనవరం మండలంలో పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు.



పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు



ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా



ముంపు గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉదారంగా ప్రభుత్వ సాయం

చింతూరు: వరద బాధితులకు ప్రభుత్వం ఉదారంగా సాయం అందిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం వారు చింతూరు మండలంలో వరద ముంపునకు గురైన ముకునూరు, ఏజీకొడేరు, కుమ్మూరు గ్రామాలతో పాటు చింతూరులో పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలు వస్తున్నాయని తెలిసిన వెంటనే ప్రభుత్వం ముందస్తుగా స్పందించి తగిన జాగ్రత్తలు తీసుకుందని తెలిపారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సహాయక చర్యలను చేపట్టిందని, కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ ఇక్కడే మకాం వేసి ఎప్పటికప్పుడు సహాయక చర్యలను పర్యవేక్షించారని వారు తెలిపారు. బాధితులెవరూ అధైర్య పడవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాలుగు మండలాల్లో ముంపునకు బారిన పడిన ప్రతి కుటుంబానికి సాయం అందేలా చర్యలు చేపడతామని, పోలవరం ముంపులో భాగంగా ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన గ్రామాలకు త్వరితగతిన పరిహారం అందించడంతో పాటు పునరావాసం కల్పించేలా చూస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కో ఆప్షన్ మెంబర్ అక్బర్‌అలీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు కోట్ల కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఏజీకొడేరులో బాధితులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

విశాఖ.. భాగ్యరేఖ



ఇనార్బిట్ మాల్ సభా వేదిక

- నేడు విశాఖకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక
- సీఎం చేతుల మీదుగా ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన
- రూ.864 కోట్ల పనులకు శ్రీకారం

సాక్షి, విశాఖపట్నం : విశ్వనగరి విశాఖకు అంతర్జాతీయ బ్రాండింగ్ కల్పించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే వేల కోట్లతో ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రూ.864.88 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రహేజా గ్రూప్ సాలిగ్రామపురంలో నిర్మించనున్న ఇనార్బిట్ మాల్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ చేస్తారు. ఫేజ్-1లో ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి రహేజా గ్రూప్ రూ.600 కోట్ల వ్యయం చేస్తోంది. 6 లక్షల చదరపు అడుగుల్లో మాల్, 4 లక్షల చదరపు అడుగుల పార్కింగ్ ప్రాంతం నిర్మించనుంది. 2026 కల్లా దీన్ని పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 250 జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్ స్టోర్స్, మల్టీప్లెక్స్‌లు, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్, ఫుడ్ కోర్టు, టెర్రస్ గార్డెన్, షాపింగ్ స్పేస్ రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి ఉపాధి కలగనుంది. అన్నింటినీ గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు.

రూ.135.88 కోట్లతో జీవీఎంసీ ప్రాజెక్టులకు శంకుస్థాపన

ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన అనంతరం.. అదే ప్రాంగణంలో నగర ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వివిధ ప్రాంతాల అభివృద్ధి, విశాఖ సుందరీకరణ ప్రాజెక్టులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారు. అమృత్ 2.0, స్మార్ట్‌సిటీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.135.88 కోట్లతో చేపట్టనున్న 50 పనుల్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కూడా జీవీఎంసీ అధికారులు పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రూ.129 కోట్లతో చేపట్టిన ఐదు కీలక ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.

వాటిలో కొన్ని వివరాలివీ..

- రూ.3 కోట్లతో 66వ వార్డులో గాజువాక జంక్షన్ నుంచి వంటిల్లు జంక్షన్ వరకూ రహదారి విస్తరణ
- రూ.2.40 కోట్లతో జోన్-3 పరిధిలో జాతీయ రహదారి జంక్షన్ నుంచి పెదవాల్తేరు జంక్షన్ వరకూ ఎండ్ టూ ఎండ్ రోడ్ విస్తరణ
- రూ.2 కోట్లతో జోన్-2లో పీఎంపాలెంలోని సాంకేతిక వైద్యవిధాన పరిషత్‌కు వెళ్లే మార్గం ఎండ్ టూ ఎండ్ రహదారి విస్తరణ
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రూ.1.33 కోట్లతో ఆర్ అండ్ బీ జంక్షన్, కాకానినగర్ జంక్షన్ అభివృద్ధి
- అమృత్ 2.0లో భాగంగా రూ.7.90 కోట్లతో భీమిలిలోని కొండపేట పంప్‌హౌస్ అభివృద్ధి
- క్రాంతినగర్, మింది, తుంగ్లాం, చినగంట్యాడ, జగ్గరాజుపేట, నరవ, కొమ్మాది, లంకెలపాలెం, నాతయ్యపాలెం, చిల్లపేట చెరువుల్లో రూ.30 కోట్లతో రెజువనేషన్ పనుల నిర్వహణ
- రూ.3 కోట్లతో సాగర్‌నగర్ వద్ద, రూ.3.24 కోట్లతో డిఫెన్స్ క్వార్టర్స్ వద్ద యురోపియన్ స్టైల్‌లో ఈట్ స్ట్రీట్స్ నిర్మాణం
- రూ.6 కోట్లతో వాల్తేరు మెయిన్ రోడ్డు నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్ జంక్షన్ వరకూ స్మార్ట్ రోడ్డు నిర్మాణ పనులు

గిట్టుబాటు ధరలతో పంటల కొనుగోలు

అధికారులకు సూచించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

పాడేరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేసి, ప్రభుత్వం మేలు చేసిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లావ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు మినుమూల సరస్వతి అధ్యక్షతన ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గిరిజనులు కష్టపడి పండిస్తున్న పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలన్నారు. పసుపును మార్క్ఫెడ్ అధికారులు సకాలంలో కొనుగోలుచేయాలని సూచించారు. పీటీజీలకు రైతులకు పవర్‌టిల్లర్లు, పవర్‌వీడర్లు, టార్పాలిన్లు అందిస్తున్నట్టుగానే మిగతా గిరిజన రైతులకు పంపిణీ చేయాలన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఉద్యానవన పంటల విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలోని ఎంతమేరకు విత్తనాలను పంపిణీ చేశారో ఆరా తీశారు. 1,353 క్వింటాల వరి విత్తనాలు, 480 కిలోల రాగి విత్తనాలను పంపిణీ చేసినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.నంద్ మాట్లాడుతూ ఈ ఏడాది 4,553 క్వింటాల రాజ్మా విత్తనాలు 90శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. జిలా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్‌రావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యానవన అధికారి అశోక్, ఏపీ సీడ్స్ డీఎం నాగసాయి పాల్గొన్నారు.

మహమ్మారిని తరిమేందుకు..
మొక్కవోని దీక్షతో..

గంజాయి పండించిన పొలాలు ఇప్పుడు ఉద్యాన పంటలతో కళకళలాడుతున్నాయి. గంజాయి సాగుపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడమే కాకుండా ప్రత్యామ్నాయంగా ఉద్యాన వన పంటలు పండించేలా గిరిజనులను ప్రోత్సహిస్తోంది. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు పంపిణీ చేస్తోంది. వాటి సంరక్షణకు నిధులు అందజేస్తోంది. దీంతో జిల్లాలో వేలాది ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు చేపట్టారు.

- గంజాయి సాగు నిర్మూలనే లక్ష్యం
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం చర్యలు
- పెద్ద ఎత్తున మొక్కల పంపిణీ
- సంరక్షణకు నిధులు
- 22మండలాల్లో 10,959 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

అనంతగిరి: జిల్లాలో గంజాయి సాగు నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఒక వైపు దాడులు నిర్వహించడమే కాకుండా మరో వైపు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. గిరిజన రైతులు గంజాయి సాగుచేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దీని వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ వారిలో మార్పు తీసుకొచ్చి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసేలా చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో గత ఏడాది 3,016 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి రూ. 1.08 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది 12 వేల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నది లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు జాతీయ ఉపాధిహామీ పథకంలో 22 మండలాల్లో 10,959 ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు రూ.91.46 కోట్లు కేటాయించింది. కాఫీ తోటలు వేసేందుకు వీలుగా వాటికి నీడనిచ్చే మొక్కలను ముందుగా వేస్తున్నారు. ఇందుకోసం ఎకరాకి 700 చొప్పున ఐదు వేల ఎకరాల్లో వేసేందుకు వీలుగా సిల్వర్ వోక్ మొక్కలు పంపిణీ చేశారు. మిగతా ఆరు వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టారు.ముఖ్యంగా జామ, సీతాఫలం, సపోటా, నిమ్మ, దానిమ్మ, చింత, నేరేడు, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, జీడి, మునగ,మామిడి, కొబ్బరి, మొక్కలను ఎకరాకు రెండు వందల నుంచి మూడు వందల వరకు పంపిణీ చేశారు. వీటిని ప్రభుత్వం ఉచితంగా అందజేసింది. మూడేళ్లపాటు ఈ మొక్కల సంరక్షణకు అయ్యేఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తుంది.



మత్స్యపురంలో గిరిజన రైతులకు మొక్కలు అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ప్రభుత్వం అందజేసిన మొక్క నాటుతున్న గిరిజన రైతు

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

చింతపల్లి, జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, పెదబయలు, ముంచంగిపుట్టు తదితర మండలాల్లోని మారుమూల గ్రామాల్లో గతంలో గిరిజనులు గంజాయి సాగుచేస్తూ జీవితాలను నాశనం చేసుకునేవారు. ఆయా గ్రామాల్లో పోలీసుశాఖ, హార్టీకల్చర్ అధికారులు ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాల గురించి వినూత్న కార్యక్రమాలతో గిరిజనుల్లో అవగాహన కల్పించి, మార్పు తీసుకువచ్చారు. 5,549 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టారు. దీంతో ఇప్పుడు గంజాయి భూములు పండ్ల మొక్కలతో కళకళాడుతున్నాయి.

మండలాల వారీగా పండ్ల తోటలు వేసిన రైతులు

మండలం	రైతులు	ఎకరాలు
అడ్డతీగల	337	352
అనంతగిరి	500	533.5
అరకువేలి	527	529
చింతపల్లి	2110	1753.61
దేవీపట్నం	173	187
డుంబ్రిగుడ	484	494
జి.మాడుగుల	693	674.5
గంగవరం	340	366
జీకే వీధి	3834	2168.8
హుకుంపేట	593	573.5
కొయ్యూరు	752	1002
కూనవరం	4	6
మారేడుమిల్లి	420	531
ముంచంగిపుట్టు	619	615
నెలపాక	15	21.9
పాడేరు	579	579
పెదబయలు	881	881
రాజవొమ్మంగి	124	151
రంపచోడవరం	319	336
వీఆర్‌పురం	10	15
వైఆర్.పురం	381	326.5

రైతులకు సుస్థిర ఆదాయమే లక్ష్యం

ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు మేలు జరుగుతుంది. రైతులు సుస్థిర ఆదాయం వచ్చేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జాతీయ ఉపాధిహామీ పథకంలో మొక్కలను ఉచితం అందజేసి, వాటి సంరక్షణకు నిధులు మంజూరు చేస్తోంది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి.



– రమేష్‌రామన్, డ్వామా పీడీ

ఒక్కో భవనం ఒక్కో ప్రత్యేకత

- ఏయూలో రూపుదిద్దుకున్న ఐదు భవనాలు
- నేడు ప్రారంభించనున్న సీఎం జగన్

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహనరెడ్డి మంగళవారం విశాఖ నగర పర్యటనలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తారు. రూ.129 కోట్లతో చేపట్టిన ఐదు కీలక ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆ హబ్

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులను ఆవిష్కర్తలుగా, భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వేదికగా ఏయూ స్టార్టప్ అండ్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ హబ్(ఆ–హబ్)ను తీర్చిదిద్దారు. ఇంజనీరింగ్ కళాశాలలలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.21 కోట్లతో దీనిని నిర్మించారు. దీనిలో ఇప్పటికే 121 స్టార్టప్‌లు పనిచేస్తుండగా, వీటిలో 114 వరకు ఆర్థిక వనరులు సృష్టించే స్థాయికి చేరుకోవడం విశేషం.



ఎలిమెంట్



ఫార్మా, బయోటెక్, జెనోమిక్స్ ఇంక్యుబేషన్, టెస్టింగ్ ల్యాబ్ కోసం ఎలిమెంట్(ఏయూ ఫార్మా ఇంక్యుబేషన్ అండ్ బయోలాజికల్ మోనటరింగ్ హబ్)ని ఏర్పాటు చేశారు. రూ.44 కోట్లతో 55 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం సిద్ధమైంది. ఔషధ రంగంలో స్టార్టప్, ఇన్నోవేషన్‌ని ప్రోత్సహించడం ఎలిమెంట్ ప్రత్యేకత.

ఏయూ సిబ్



ఏయూ అవుట్‌గేట్ వద్ద 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 18 కోట్లతో ఏయూ–సిబ్(ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్) నిర్మించారు. ఐఐఎం విశాఖపట్నంతో ఒప్పందంలో భాగంగా ఇంటర్నేషనల్ బిజినెస్ అండ్ అనలిటిక్స్‌లో బ్యాచిలర్, పీజీ కోర్సులు కేంద్రం ద్వారా అందిస్తారు.

ఏయూ–అవంతి...



బీచ్‌రోడ్డులో ఏయూ–అవంతి ఆక్వాకల్చర్ ఇన్నోవేషన్ అండ్ స్కిల్ హబ్‌ని రూ.11 కోట్లతో 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. అవంతి ఫౌండేషన్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందలో భాగంగా మెరైన్ ఫార్మింగ్ రగంలో నైపుణ్య శిక్షణ, ఎంటర్‌ప్ర్యూనర్‌షిప్‌ను ప్రోత్సహించే దిశగా ఈ కేంద్రం సేవలు అందిస్తుంది.

అల్గారిథమ్



ఏయూ డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌గా అల్గారిథమ్ నిలుస్తోంది. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఎదురుగా 60వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ 35 కోట్ల వ్యయంతో అల్గారిథం నిర్మించారు. ఇందులో 250 మంది కూర్చునే రెండు సెమినార్ హాళ్లు, స్మార్ట్ క్లాస్ రూములు 15, ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు ఉపయుక్తంగా 500 కంప్యూటర్లు కలిగిన ఒక అంతస్తు కలిగి ఉంది.

గిరిరైతులకు సేవలందించండి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



హాజరుపట్టి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయటౌన్: గిరి రైతులకు వ్యవసాయశాఖ ద్వారా సేవలు అందించి, మంచి దిగుబడులు సాధించేందుకు మీరంతా కృషి చేయాలని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ, పశువైద్యశాలలు తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో కేవలం అటెండర్ మత్స్యరాజు మాత్రమే ఉండడం, లైట్లు లేక చిమ్మ చీకటిగా ఉండటాన్ని ఎమ్మెల్యే గమనించారు. లైట్లు వేసుకొని హజరు పట్టి తనిఖీ చేశారు. సిబ్బంది గైర్హాజరుపై ఏఓ కె.హైమావతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాడేరులో కలెక్టర్‌తో మీటింగ్‌కు ఏడీ వెళ్లినట్లు ఆమె తెలిపారు. ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న సమయంలో గిరిరైతులకు సలహాలు, సూచనలు అందించాల్సిన సిబ్బంది గైర్హాజరు కావడం సరికాదన్నారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఎప్పుడు ఇస్తారో రైతులకు తెలియడం లేదంటూ నాయకులు వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు ఎమ్మెల్యేకు తెలియజేశారు. అనంతరం పశువైద్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పాల్గుణ తనిఖీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి, నాయకులు నర్సింగ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లోయలోకి దూసుకుపోయిన లారీ

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



లోయలోకి దూసుకుపోయిన లారీ

అనంతగిరి: మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డు తైడా సమీపంలోని లారీ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. అరకులోయ నుంచి కొత్తవలసకు తవుడు లోడుతో వెళుతున్న లారీ, మండలంలోని 1వ నంబర్ హెయిర్ పిన్‌బెండ్ మలుపు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి 30 అడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలోని డ్రైవర్ ఎర్రనాయుడు, క్లీనర్ సన్యాసి ఇద్దరు గాయాలపాలైయ్యారు. స్థానికుల సాయంతో 108 వాహనంలో డ్రైవర్, క్లీనర్లను ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. తవుడు లోడు కావడంతో అగ్నిప్రమాదం జరగకుండా ముందస్తుగా ఎస్.కోట నుంచి ఫైర్ ఇంజన్ వాహనాన్ని రప్పించారు. పెనూ ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేశారు.

డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్‌గా విజయ్



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ్ శేఖర్

సాక్షి, విశాఖపట్నం: నేవల్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్‌గా రియర్ అడ్మిరల్ విజయ్ శేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న రియర్ అడ్మిరల్ సంజయ్ సాధు వెస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(టెక్నికల్)గా బదిలీ అయ్యారు. సంజయ్ నుంచి విజయ్ బాధ్యతలు చేపట్టారు. విజయ్‌శేఖర్ ఇండియన్ సబ్‌మెరైన్స్ ఐఎన్ఎస్ వాగ్లీ, శంకుల్, షాల్కీతో పాటు ఐఎన్ఎస్ జ్యోతి వార్ షిప్‌కి ప్రాతినిధ్యం వహించారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఇంటిగ్రేటెడ్‌హెడ్ క్వార్టర్స్‌లో మెటీరియల్ అసిస్టెంట్ చీఫ్‌గా విధులు నిర్వర్తించారు. నేవల్ డాక్‌యార్డు విశాఖపట్నం, ముంబైలో పలు బాధ్యతలు చేపట్టారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

తాటిచెట్లపాలెం: కైలాసపురంలో రోహేజా గ్రూప్ నిర్మాణం చేపట్టనున్న ఇనార్బిట్‌మాల్ శంకుస్థాపన ఏర్పాట్లు పూర్తయ్యాయని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాల్ ప్రారంభమైతే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రూ.139 కోట్ల వ్యయంతో నగర సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం ప్రపంచ స్థాయి గుర్తింపు సంతరించుకోనుందన్నారు. ముందుగా జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి కూడా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. తరువాత పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్‌చైర్మన్ కేకే రాజు కూడా శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు రవి కృష్ణంరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రజా ఆరోగ్య అధికారి నరేష్ కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు, జోనల్ కమిషనర్లు, ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మలేరియాతో గిరిజన విద్యార్థిని మృతి



వనుగు శ్రావణి (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ గుమ్మసిరగంపుట్టు గ్రామానికి చెందిన వనుగు శ్రావణి(8) అనే గిరిజన విద్యార్థిని సోమవారం విశాఖ కేజీహెచ్‌లో మృతి చెందింది.విద్యార్థిని తండ్రి రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రావణి కించాయిపుట్టు ఎంపీయూపీ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. వైద్య పరీక్షలు చేయగా మలేరియా అని తెలింది. సత్వరమే వైద్యసేవలందించినా పరిస్థితి విషమంగా మారడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్టు తండ్రి రాంబాబు తెలిపాడు. గ్రామంలో జ్వరాలు ప్రబలినా ఆశ వర్కర్ కనీసం పట్టించుకోవడం లేదని, ఆమె నిర్లక్ష్యం వల్లే తన పాప చనిపోయిందని ఆరోపించాడు. గతంలో పలుమార్లు వైద్యశాఖ అధికారులకు ఈ విషయం తెలిపినా స్పందన కరువైందని, ఆశ వర్కర్‌ను వెంటనే మార్చాలని రాంబాబుతో పాటు గుమ్మసిరగంపుట్టు గ్రామస్తులు కోరారు.

మహిళ హత్య కేసులో ఏడుగురి అరెస్టు

వివరాలు వెల్లడించిన ఏఎస్పీ జగదీష్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ జగదీష్, చిత్రంలో వెనుక నిందితులు

మారేడుమిల్లి: మండలంలోని చావడికోట పంచాయతీ బంద గ్రామానికి చెందిన పల్లాల బున్నమ్మ(53) అనే మహిళ హత్యకేసులో ఏడుగురు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్టు ఏఎస్పీ జగదీష్ అడహళ్లి తెలిపారు. ఆ వివరాలను సోమవారం విలేకరులకు వెల్లడించారు. మృతురాలు బున్నమ్మ ఇంటి పక్కనే ఉంటున్న సాదల రామిరెడ్డి భార్య అమ్మాయమ్మ రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. బున్నమ్మ చేతబడి చేయడంతోనే అనారోగ్యానికి గురైందన్న కోపంతో గత నెల 23వ తేదీన రామిరెడ్డి తన అన్నదమ్ముల సాయంతో బున్నమ్మ మెడకు తాడు బిగించి ఊపిరాడకుండా చేసి హత్యచేశాడని ఏఎస్పీ తెలిపారు. మృతదేహాన్ని అటవీప్రాంతంలో గొర్రెలగొప్పు శ్మశానవాటికలో మరికొందరి సాయంతో పూడ్చిపెట్టినట్టు చెప్పారు. మృతురాలి కూతురు భద్రమ్మ గత నెల 26న మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. సీఐ రమేష్, ఎస్ఐ రాము కేసు దర్యాప్తు చేసి సాదల రామిరెడ్డి, సాదల నీలంరెడ్డి, సాదల బొర్రం రెడ్డి, వీరికి సహకరించిన బాలురెడ్డి, ధర్మారెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డిలను అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితులు రంపచోడవరం కోర్టులో హాజరు పరచినట్టు ఏఎస్పీ తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు మూఢనమ్మకాలు వీడేలా చైతన్యవంతులను చేసి, ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

వై.రామవరం: సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు లేకపోయినప్పటికీ ప్రతి ఒక్కరూ అప్రమతంగా ఉండాలని అడ్డతీగల సీఐ వై. రాంబాబు సిబ్బందికి సూచించారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఆయన సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. సోమవారం ఇక్కడ జరిగిన వారపు సంతలో నిర్వహించిన తనిఖీల్లో పాల్గొన్నారు. సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై వారపుసంతకు వచ్చినవారిని ఆరా తీశారు. వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు.స్టేషన్‌లో ఉన్న ఏపీఎస్పీ 16వ బెటాలియన్ అదనపు పోలీసు బలగాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మావోయిస్టు వారోత్సవాలు ముగిసే వరకు అప్రమతంగా ఉండాలని సూచించారు.

ఈ ప్రాంతంలో ఇంతవరకు జరిగిన మావోయిస్టు సంఘటనలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎస్ఐ ఎం. సంతోష్‌కుమార్, ఏపీఎస్పీ 16వ బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు మహిళా పోలీసుల వినతులు





పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణకు వినతిపత్రం అందజేస్తున్న మహిళా పోలీసు సంఘం నేతలు

సాక్షి,పాడేరు/అరకులోయ టౌన్: జిల్లాలోని మహిళా పోలీసుల సంఘం నేతలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. పోలీసుశాఖ పర్యవేక్షణలోనే మహిళా పోలీసుల విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, హోంశాఖ మాతృశాఖగా కొనసాగిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతిలో కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, భాగ్యలక్ష్మి, పాల్గుణ వేర్వేరుగా వారితో మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో మహిళా పోలీసుల వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికి గ్రామస్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు బాలికల రక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పాడేరులో మహిళా పోలీసుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సత్యవతి, ప్రతినిధులు నూకరత్నం, ఆదర్శిని, మంజుభార్గవి, భారతి, జయంతి, అరకులోయలో మహిళా పోలీసు వెల్ఫేర్ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి.జయలక్ష్మీ, తదితరులున్నారు.

యువతకు ఉపయుక్తంగా ఏయూలో వసతులు



ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఉత్తరాంధ్ర యువతకు ఉపయుక్తంగా ఏయూలో మౌలిక వసతుల కల్పన చేస్తున్నామని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఏయూ సెనేట్ మందిరంలో ఏయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, మెరైన్ సైన్సెస్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు జరిపే దిశగా యువతను ప్రోత్సహించడానికి ఐదు విభిన్న ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించనున్న ఈ ప్రాజెక్టులను ఉత్తరాంధ్ర యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుబంధ కళాశాలల్లో ఈ ఐదు భవనాల ప్రారంభోత్సవాలను విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసారంలో చూపాలని సూచించారు. కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేకంగా తమ విద్యార్థులను ఏయూకు తీసుకువచ్చి ప్రత్యక్షంగా కూడా వీటిని చూడవచ్చునన్నారు. ఏయూలో గత మూడేళ్లలో 18 ప్రాజెక్టులను చేపట్టి పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార ఆచార్య వి.కృష్ణమోహన్, సీడీసీ డీన్ ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

- శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని రైల్వే గేటు సమీపంలోని శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణానికి అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ రూ. 50 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గత కొంత కాలంగా వర్తక సంఘం నాయకులు, స్థానికులు స్థానిక శ్మశానవాటిక కబ్జాకు గురవుతుందని, కాపాడాలని కోరారన్నారు. ఈ మేరకు ప్రహరీ నిర్మాణానికి తాను హామీ ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గాలకు కేటాయించిన ప్రత్యేక నిధుల్లో భాగంగా అరకులోయ నియోజకవర్గానికి రూ. 1.20కోట్లు మంజూరు చేశారన్నారు. దీంతో శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ. 50 లక్షలు కేటాయించామన్నారు. శ్మశానవాటిక స్థలం, హద్దులను ఇంజినీరింగ్ అధికారులకు అప్పగిస్తే సర్వే చేసి, ప్రతిపాదన తయారు చేస్తారని, త్వరితగతిన స్థలాన్ని అప్పగించాలని తహసీల్దార్ వేణుగోపాలరావుకు సూచించారు. వెంటనే పనులు ప్రారంభించి రెండు నెలల్లో పనులు పూర్తి చేసి అప్పగించాలని టీడబ్ల్యూ ఏఈఈ అభిషేక్‌కు ఆదేశించారు. మండలంలో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యమిచ్చామన్నారు. శ్మశానవాటిక మీదుగా హైవే రోడ్డు వేయడంతో మొత్తం 3.90 ఎకరాలకు గాను 3.16 ఎకరాల భూమి పోయిందన్నారు. కేవలం 74సెంట్లు మాత్రమే ఉందని తహసీల్దార్ వేణుగోపాలరావు చెప్పారు. మిగిలి ఉన్న స్థలాన్ని అప్పగిస్తామన్నారు.

ఆనందంలో గ్రామస్తులు

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు, వర్తక సంఘం అధ్యక్షుడు కాపుగంటి కృష్ణారావు మాట్లాడుతూ శ్మశానవాటిక ప్రహరీ కోసం గత ప్రభుత్వాలకు స్థానికులు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. అయితే ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన వెంటనే ఆయన తక్షణమే స్పందించారని, కొద్ది రోజుల్లోనే నిధులు మంజూరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జై జగన్, జై పాల్గుణ, జైజై వైఎస్సార్‌సీపీ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి, ఎంపీటీసీ ఎల్.బి. భీమరాజు, వైస్ ఎంపీపీ రామన్న, మాజీ ఎంపీటీసీ వెంకటరావు, నాయకులు లక్ష్మణ్ కుమార్, కామరాజు, నాగరాజు, ఈఓపీఆర్డీ విజయ్, సర్వేయర్ వేణి, తదితరులున్నారు.

హిందీ హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) సెప్టెంబరులో నిర్వహించే హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఆంధ్ర, తెలంగాణలో వర్షాల కారణంగా రూ.10 అపరాధ రుసుముతో ఈ గడువు పెంచినట్టు నిర్వాహకులు ప్రకటించారు. మిగిలిన వివరాలకు 89858 97419లో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు కోరారు.

సర్పంచ్ మృతికి సంతాపం



పుష్పలమ్మ (ఫైల్)

హుకుంపేట: బారమసి సర్పంచ్ బెటకారి పుష్పలమ్మ(40) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె పక్షవాతంతో బాధపడుతూ వైద్యసేవలు పొందుతున్నారు. ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించి సోమవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు సంతాపం తెలిపారు.

నేటి నుంచి ఫార్మేటివ్ - 1 పరీక్షలు

- ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు
- ప్రైవేటు స్కూళ్లలోనూ అమలు చేయాల్సిందే
- ప్రభుత్వ స్కూళ్లలో తొలిసారిగా టోఫెల్ పరీక్ష
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖాధికారులు



విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయురాలు

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో మంగళవారం నుంచి ఫార్మేటివ్ – 1 / క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. వీటి నిర్వహణకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల విద్యాశాఖాధికారులు అంతా సిద్ధం చేశారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి ఇవే తొలి పరీక్షలు కావడం, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా టోఫెల్ పరీక్ష నిర్వహిస్తుండడంతో విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ప్రైవేటు పాఠశాలల్లో సొంతంగా తయారు చేసుకున్న ప్రశ్నాపత్రాలతో పరీక్షలు నిర్వహించుకునే వారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన పాఠ్య పుస్తకాలతోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బోధన సాగుతున్నందున, ఒకే విధానంలో పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖాధికారులు ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను కూడా ఎస్‌సీఈఆర్‌టీ ద్వారానే సరఫరా చేస్తున్నారు. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ నిర్వహణ కోసం ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులందరికీ ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన ప్రశ్నాపత్రాలతోపాటు, ఓఎమ్మార్ షీటు కూడా ఇస్తారు. జవాబులను ప్రశ్నాపత్రంలో టిక్ చేయటంతోపాటు రాయాలి. అదేవిధంగా ఓఎమ్మార్ షీట్‌లో బబుల్ చేయాలి. పరీక్షలకు అవసరమైన సామాగ్రిని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా పాఠశాలలకు సరఫరా చేశారు.

తొలిసారిగా టోఫెల్ పరీక్ష

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన సాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు తొలిసారిగా ‘టోఫెల్’ పరీక్ష నిర్వహిస్తున్నారు. ‘ఇంగ్లిష్ పేపర్ పార్ట్ – బీ’లో టోఫెల్‌కు సంబంధించిన అంశాలు ఉంటాయి. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్, స్మార్ట్ టీవీలు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో టోఫెల్ పరీక్షను తప్పనిసరిగా నిర్వహించాలని, మిగతా చోట్ల ఉపాధ్యాయుల ఆసక్తి మేరకు నిర్వహించొచ్చని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఫార్మటివ్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రశ్నాపత్రాలను పాఠశాలలకు సరఫరా చేశాం. టోఫెల్ పరీక్షను తొలిసారిగా నిర్వహిస్తున్నందున ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఏవైనా అనుమానాలు ఉన్నట్లెతై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి. జవాబు పత్రాల మూల్యాంకనం సకాలంలో పూర్తి చేసి, ఉన్నతాధికారులకు నివేదించాలి.

– ఎం.వి.కృష్ణ కుమార్, డీసీఈబీ సెక్రటరీ, ఉమ్మడి విశాఖ జిల్లా